# ప్రేమించు ప్రేమకై

సాయంత్రం... నాలుగు దాటుతోంది.

ఎండగానే ఉంది. కాని... శీతాకాలం కావడాన... ఆ ఎండ వేడిగా కాక వెచ్చగా మాత్రమే ఉంది. అందుకే – రోడ్డు మీ జనసంచారమూ మరీ పల్చగా ఏమీ లేదు.

మైథిలికి తోచనట్లనిపించింది. ఆయన ఆఫీసు నుంచి వొచ్చి టీ అడిగేవరకూ చేయవలసిన పనేముంది కనుక? మరో గంటన్నరయినా పోతే తప్ప ఆయన రారు. ఆమె...ముఖం కడుక్కుని... కొంచెం తయారై... గేటు దగ్గరికి వొచ్చింది. గేటు పట్టుకుని నిలుచుని... రోడ్డు మీద వొచ్చేపోయేవారిని చూస్తూంటే...

“అమ్మగారూ! పూలు తీసుకుంటారా?”అడిగాడు పువ్వులబ్బాయి.

వొద్దన్నట్లు అడ్డంగా తలూపింది. వాడు పొరపాటు పడ్డాడు. కాకపోతే యీ వయసులో తనకింకా మల్లెలూ మొల్లలూనా? అమ్మాయికి పెళ్ళిచేసి అత్తారింటికి పంపింది ఆరు నెలల కిందటే. అబ్బాయి – ఇంజనీరింగ్ చదువుతున్నాడు. తను ఓ అమ్మాయికీ అబ్బాయికీ అమ్మ. ఇంకా పూలూ పళ్లూ వయసా తనది?

అదుగో పోస్టుమాన్! తనకేమయినా ఉత్తరాలున్నాయేమో. ఉత్తరం వొస్తే బాగుండును. అమ్మాయి కొత్త కాపురం విశేషాలో... అబ్బాయి చదువు కబుర్లో...

“మైథిలిగారంటే...” ఆగాడు పోస్టుమాన్.

“నేనే” అందామె.

“ఉత్తరం” అంటూ ఓ కవరందించి వెళ్ళిపోయాడు.

ఆమె కవరు వేపు చూసింది. అడ్రసు – తన పేరుమీదే ఉంది. ఆయన పేరిట కాకుండా. ఇదేమిటి? వారి పేరు లేకుండా... తనపేరు, డోర్ నంబర్లతో...

ఇది ఎవరిపని అయిఉంటుంది? అబ్బాయిదా, అమ్మాయిదా?

అమ్మాయి పనే అయిఉంటుంది. స్త్రీ పురుష సమానత్వమూ అదీ అనేది పెళ్లయ్యేవరకూ. స్త్రీ కూడా మనిషే, వ్యక్తే, స్వతంత్రురాలే... అంటూ లెక్చర్లిచ్చేంది. అందుకే ఈ ఉత్తరం కూడా – వారి పేరున కాకుండా తన పేర వ్రాసి ఉంటుంది. జీవితంలో కేరాఫ్ కాకుండా తన పేరుతో నేరుగా వొచ్చిన మొదటి ఉత్తరం.

ఆమెకు ఆనందమనిపించింది. చిత్రమూ అనిపించింది. తన పేరుని రాతలో చూసుకుంటూ కవరు పట్టుకుని – లోపలికి నడిచింది. వరండాలో – సోఫాలో కూర్చుని... మళ్ళీ ఓసారి కవరు మీద తన పేరుని చూసుకుంది. అప్పుడు తెరిచింది మెల్లగా.

లోపల... నీలిరంగు కాగితం. ఆకుపచ్చ అక్షరాలు. ఆ కాగితంలోంచి... ఏదో పరిమళం! ఆమె ఆత్రంగా చదవసాగింది.

"మై డియర్ మైథిలీ!"

సంబోధనకే ఉలిక్కిపడిందామె. ఈ ఉత్తరం... తనకే. తనదే. కాని ఏమిటీ పిలుపు? ఎవరు రాశారిలాగ?

"పిలుపుకే అంత ఉలికిపడితే ఎలా? నా పిలుపు గుండె తలుపు తట్టినట్లుందా? ఎన్నాళ్లుగానో మూసుకుని ఉండిపోయిన హృదయ కవాటాలను తెరుస్తున్నట్లనిపిస్తోందా? అందుకేగా యీ ప్రేమలేఖ డియర్!"

"నిజానికి – మిమ్మల్ని... మీరు అని పిలవాలి. కాని... ప్రేమకి బహువచనం ఉండదు. అందుకని అర్థం చేసుకోగలవను కుంటాను. ఆగ్రహం చెందవని ఆశిస్తాను. కొంచెం నిదానంగా... ప్రశాంతంగా... పూర్తిగా యీ వలపుటుత్తరం చదవమని ప్రార్థిస్తున్నాను. ప్లీజ్...

"జీవితం చిత్రవిచిత్రాల సంపుటి. శారీరక మానసిక అనుభవాల దొంతర. ఆ చిత్రాలలో అతివిచిత్రమయినది ప్రేమ. ఈ ప్రేమ... ఎప్పుడు...ఎందుకు...ఎవరి మీద... ఎలా ఉదయిస్తుందో ఎవరికెరుక? అందుకే – జీవితంలో అత్యంత ఉత్కంఠ (సస్పెన్స్) ప్రేమట!. నేను నిన్ను ప్రేమిస్తున్నాను మైథిలీ!

నమ్మలేక పోతున్నావా? ఔనులే. ప్రేమ ఎప్పుడూ ఆశ్చర్యమే. మరి నీకొక విషయం... నువ్వు నమ్మలేని నిజం...నామనసులోని మాట...చెప్పేదా?

మైథిలీ! నువ్వు మహాసౌందర్యవతివి. ఎందుకంటే నువ్వు స్త్రీవి. స్త్రీ అంటే సౌందర్యానికి పర్యాయపదమే. నామాట మీద నమ్మకం కుదరకపోతే... వొక్కసారి అద్దం ముందుకి వెళ్లి నిలుచో. నిను – నువ్వులా కాక... మరొకరిలాగ...నిష్పక్షపాతంగా... ఒకరికి భార్యవనీ... ఇద్దరి పిల్లల తల్లివనీ అవతల పెట్టి... చూసుకో. నువ్వు అంతమయిన దానివని నువ్వే అంగీరిస్తావు. ఏమో... నా కళ్ళకు మాత్రం నువ్వు అందాల దేవతవే మైథిలీ! గులాబి రేకుదే కాదు, గుమ్మడి పువ్వుదీ అందమే.

నీ కన్నులలో – మిణుకుమిణుకుమని మెరిసే జీవనలాలన ఆ వెలుగుల దీపాల చుట్టూ పరిభ్రమించాలని యీ ప్రేమ శలభపు ఆత్రుత.

కొండమీంచి ఊరికే జలపాలమే కాదు; నిబ్బరంగా... నిదానంగా... నిండుగా పారేనదిదీ అందమే. నీకొక విషయం తెలుసా?

శబ్దం కంటె – నిశ్శబ్దమే మధురం.

చలనం కంటె – నిశ్చలనమే సుందరం. యౌవనం కంటే ప్రౌఢత్వమే ఆహ్లాదం.

నా కనులకి నువ్వు – దివి నుండి భువికి దిగివొచ్చిన దేవతవే నా కోసం సాక్షాత్కరించిన అపర రతీదేవివి.

నా ఆరాధ్య దేవతా! మైథిలీ ఐ లవ్ యు. ఎందుకు నిట్టూర్పు విడుస్తావ్? వొద్దు. జీవితానికి నిర్వచనం – నిట్టూర్పు ఎంత మాత్రమూ కాదు. నిండు మనసుతో ప్రేమించడం.

అన్నట్లు... నన్ను నేను పరిచయం చేసుకోనేలేదుకదూ యింతవరకూ? అందుకు బలమయిన కారణమే ఉందిలే. మన ప్రేమ కొంత ఎదిగాక...సముఖంగా మనం వొకరినొకరం పరిచయం చేసుకోవచ్చు. అయినా...ప్రేమకి పరిచయం అవసరమా?

ఇప్పటికి... యీ ఉత్తరంవరకూ...యీ మాత్రం చాలు; అర్థమయిందిగా. ఐ లవ్ యు. నా

ప్రేమ లాగే యీ లేఖా సశేషమే. ఇవాళ సోమవారం. రేపు మంగళవారం మరొక ఉత్తరం. ఎదురుచూస్తావుగా?

ప్రస్తుతానికి శలవ్.

సంతకం స్థానంలో - అరీను బొమ్మా. అందులోకి గుచ్చుకుంటున్న బాణమూ.

మైథిలికి మతి పోయిందా ఉత్తరం పూర్తిచేసేటప్పటికి. ఆమెలో ఏం జరుగుతూందో ఆమెకే తెలియడం లేదు... ఒకపక్క భయం... మరోపక్క లీలగా సంతోషం. ఆశ్చర్యం... ఆనందం... దుఃఖం... కుతూహలం...అన్ని భావాలూ ఒకేసారామెనావరించి...ఆక్రమించి... ఆమెను వొణికింప జేస్తున్నాయి.

ఎవరు వ్రాశారిది? ఎందుకు వ్రాశారు? రేపు మళ్లీ మరో ఉత్తరం! ఎందుకు? తననుంచి ఏమాశించి? ఆంటీ -అని పిలవబడవలసిన తనని ఆరాధ్య దేవతా అని పిలుస్తున్న యీ అమాయకుడెవరు? కుర్రతనమా, వెర్రితనమా? తను అతనికంటికెలా కనపడిందసలు? ఈ వయసులో... తనకి...ఎవరో తెలియని వారినుంచి వలపు జాబు!

పెళ్ళికి ముందే తెలియదు ప్రేమంటే. అమ్మా నాన్నగారూ చూసిన సంబంధం చేసుకుని... సంప్రదాయ సిద్ధంగా సంసారం చేసి...బుద్ధిగా యిద్దరు పిల్లల్ని కన్నది. ఇప్పటికీ భర్తంటే భయమే. అత్యవసరమయితే తప్పవారి ముందుకి వెళ్ళదు. అనవసరమైనది వొక్కమాట మాట్లాడదు. వారంటే - భయంలాటి గౌరవం...గౌరవంలాటి భయం. వారూ ముభావంగానో...మౌనంగానో ఉంటారు. గంభీరంగా...మౌనంగా. నిజానికి...తనకి వారి చేతులు తన చేతులలోకి తీసుకోవాలనీ...వారి కౌగిలిలో హాయిగా కరగాలనీ ఉంటుంది. కాని - తను ఎలా చొరవతీసుకోగలదు స్త్రీ అయిఉండి? ఆయన తనను మరోలా భావించరూ? ఏమిటో...తమ మధ్య... అర్థం కాని దూరం.

గాలికి... ఉత్తరం రెపరెపలాడింది. కట్టుకున్న చీర - చెమటకి తడిసి...ముద్దయి... ఆమె తడబడుతూనే లేచి నిలుచుంది.

ఈ ఉత్తరం ఏం చేయాలి?

వారికి చెబితే...ఛీ...నవ్వరూ? ఈ వయసులో నిన్ను ప్రేమించే కుర్రవాడా... పిచ్చాసుపత్రి నుంచి ముందుగా పారిపోయి వచ్చినవాడేమో - అంటారా? లేక...తనని అనుమానించి అపనిందలు వేస్తారా? ఏమో... మగవారికి జీవితాంతమూ భార్యమీద అనుమానం ఉండనే ఉంటుందట.

ఒద్దు... అందమయిన నాగుపాములాంటి యీ ప్రేమలేఖ - వారి కంటపడితే - అంతకంటే భయంకరమూ, నగుబాటూ యింకేమీ ఉండదు. దీనిని...

చింపెయ్యబోయింది కోపంగా. కాని... ఆశ్చర్యంగా... ఎందుకో చేతులు రాలేదు! మనసులోని బలహీనత. ఏదో తెలియని ఆకర్షణ. ఒక్కసారి ఆమెకు సందేహం కలిగింది. తను- యీ ప్రేమలేఖని ప్రేమిస్తూందా? ఏమో- ఒక్కమాట మాత్రం నిజం. ఉత్తరం ఆద్యంతమూ తమాషాగా ఉంది. అన్నీ తలకి తెలిసిన పదాలే. కాని వీటిలో కొత్త అర్థాలూ, వింత భావాలూ. ఒక్కొక్క వాక్యమూ చదువుతూంటే గుండెలలో గిలిగింత... ఏవో తెలియని కొత్త లోకాలకు ఎగిరిపోతున్నట్లు... అవి - ప్రేమ లోకాలు కాబోలు.

ఏమయినా యీ ఉత్తరం...సామాన్యమయింది కాదు. ఇది- వరంలా కనిపిస్తున్న శాపమో,

శాపంలా అనిపిస్తున్న వరమో. ఆకతాయిబ్బాయి ఎవరోకాని– తన గురించి అంతా తెలిసే రాశాడు. పొరపాటుపడి రాయలేదు. అది ఖచ్చితమే.

ఇవాళ ఇది. రేపు మరొకటి... చివరకీ ప్రేమలేఖ లెక్కడికి దారితీస్తాయి. స్థబ్దంగా గడుస్తున్న తన జీవితంలో– యీ ప్రేమలేఖలు వరాలు కాబోతున్నాయా, శాపాలుగా పరిణమించబోతున్నాయా?

ఏం చేయాలి దీన్ని? ఖరీదయిన కాగితం మీద... సువాసనలు వెదజల్లే... అందమయిన అక్షరాల... ప్రేమజల్లుని – చేతులారా చించడం తనతరం కాదు. అంటించి బూడిద చేయడమూ తన వశం కాదు. మరి? ఆమె ఆ ఉత్తరాన్ని భద్రంగా... తన బట్టల పెట్టిలో అడుగున పెట్టింది – వారి కంటపడకుండా. అప్పటికి తెలిసిందామెకి వారు వచ్చే వేళయిందని. స్నానంచేసి...చీర మార్చుకుని... ముఖాన బొట్టు పెట్టుకుంది. అయిన మనసులో తొణికిసలాటే. వారు వచ్చి... టీ కప్పుని టీపాయి మీద ఉంచుతూంటే చేతులు ఒణుకుతూ...టీ వొలికిపోయే ప్రమాదం త్రుటిలో తప్పింది.

"అలా ఉన్నావేం?"

"....." పెదవి కదపలేక...తలవొంచుకుంది.

"కొత్తవాళ్ల ముందులా ఆ కంగారు దేనికీ? ఒంట్లో బాగానే ఉందా?"

బాగుండనిది మనసులోనే– అని చెప్పలేక– ఆయన ముఖం చూడలేక.. అక్కడి నుంచి వెళ్లిపోయింది.

మర్నాడు... ఆమెలో మధ్యాహ్నం నుంచే మానసిక సంఘర్షణ. ఇవాళ ఉత్తరం... నిజంగా వస్తుందా? రాకపోతే బాగుండును. రాత్రంతా కలలనిండా ఆ ఉత్తరమే కాదూ? నిద్ర సరిగా పట్టనివ్వకుండా. అయినా తను చిన్నపిల్లలా... ఆ ప్రేమలెఖని పట్టించుకోడమేమిటి ఈ వయసులో? ఉత్తరం రాదేమో. అయ్యో– రాకపోతే ఎలాగ? ఆ తియ్యని మాటలు, గమ్మత్తయిన వాక్యాలూ... వెన్నెల స్నానంలాటి వలపులేఖ...రాకపోతే ఎలా? అయినా ఎందుకురాదూ? అతను రాస్తానన్నాడుగా. ఏమో.. మరిచిపోతాడేమో. ఏమిటిది? కుర్రదానికంటే అధ్వాన్నమయిపోతూందే తను... వారపత్రికలలో నవలలో ప్రేమను గురించి ఎన్ని కథలు చదవలేదు? ఎన్ని సినిమాలు చూడలేదు? అప్పుడేమీ అనిపించేది కాదే, మరి ఇప్పుడు? ఓహో! ప్రేమ లేఖలందుకోడంలో కాబోలా ప్రత్యేకత!

ఆమె– మంచి చీర కట్టుకుంది. చక్కగా తయారయింది. పోస్టుమాన్ రావలసిన వేళకి గంటముందు నుంచే గేటుదగ్గర నిలబడసాగింది.

"అమ్మగారూ.. పూలు"

"వద్దులే..అహా...ఇవ్వు...మూల ఇవ్వు" తీసుకుని ముడిలో తురుముకుంది. అప్పుడనిపించిందామెకి– ఔనూ, వచ్చేది ఉత్తరమేకాని, అతను కాదుకదా? ఉత్తరం అందుకుందుకు ఇంత అలంకారమూ, ఆర్భాటమూ దేనికీ? ఊc ప్రేమలేఖలు మనుషులకి మెదడు పనిచెయ్యనివ్వవు కాబోలు! ఇంకా రాదేం పోస్టుమాన్? తొందరగా ఉత్తరం ఇవ్వడేం? ఇవాళేం రాస్తాడో అతను? వీధి చివరవరకూ దృష్టి సారించింది. పోస్టుమాన్ జాడ కనిపించలేదు.

తను తప్పు చేస్తోందా? వారికి ద్రోహం చేస్తోందా?

ఉహు.. ఉత్తరం చదివినంత మాత్రానే నేరమౌతుందా? తనేమీ అతనికి జవాబు రాయబోవడం

లేదుగా. చిలిపివాడో, అమాయకుడో. ఎవరిని ప్రేమించాలో ఎరుగనివాడు. వయసు చూడకుండా వలపు వలలో చిక్కినవాడు. చిన్నవాడు... రాసిన ఉత్తరం చదివితే రాద్ధాంతం దేనికీ? నవలూ కథలూ చదవరూ, అలాగే దీనిలో నేరమూలేదు, ద్రోహమూ లేదు. ఈ ఉత్తరం ధర్మమా అని మధ్యాహ్నం వేళ.. ఏమీ తోచకుండా నిర్లిప్తంగా ఉండవలసిన దుస్థితి తప్పింది. నిన్నటి ఉత్తరం చదువుకుంటూ హాయిగా గడిపింది.

"పోస్ట్"

ఒకటి కాదు.. రెండు కవర్లు. ఆత్రంగా ఆరాటంగా అందుకుంది మైథిలి. మొదటిది- అతని నుంచి సరిగ్గా నిన్నటి లాటి కవరే. రెండవది- అమ్మాయినుంచి ఫ్రమ్ అడ్రస్ రాసి ఉంది. వరండాలో కుర్చీలో కూర్చుని... ఒక్కక్షణం సందిగ్ధంలో పడిందామె.

అమ్మాయినుంచి... అతని నుంచి.. ఏ కవరు తెరవాలి ముందుగా? ఒకనిముషం. ఆమె ఉత్తరం తెరచి చదవసాగింది.

"ప్రియమైన నా మైథిలీ!"

నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఈ విషయం విన్నావా? ప్రేమకు వయసుండదట. ఔనూ,,, ఇంతకీ వయసంటే ఏమిటి? మనుషులకి శారీరకమయిన వయసునూ, మానసిక వయసూ వేరువేరట. అందుకే అన్నాడో కవి 'కొంతమంది పిల్లలు పుట్టుకతో వృద్ధులు' అని.

ఈ ఉత్తరం కోసం ఎదురుచూశావు. ఔనా? అబద్ధమాడకు. ఆ ఎదురు చూడటమనేదే యౌవన చిహ్నం. బాల్యం భవిష్యత్తు గురించీ, యౌవనం వర్తమానం గురించీ, వృద్ధాప్యం గతం గురించీ తహతహలాడుతుందట. మనం వర్తమానం కోసమే ఆతృతపడదాం.

నేను నిన్ను ప్రేమిస్తున్నట్లే.. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు కదూ? అదిగో... నీ కళ్లల్లోని మెరుపే చెబుతోంది. సిగ్గెందుకూ? ప్రేమే నేరమౌనా అనలేదూ లైలా? ప్రేమించు మైథిలీ... ప్రేమించు. ప్రేమే జీవితం. ప్రేమ- ప్రేమను- ప్రేమించాలి. అప్పుడే జీవితం స్వర్గమౌతుంది. ప్రేమించు ప్రేమకై.

ఏమిటీ గోల? రామనామంలా ప్రేమనామ జపం చేస్తాడేం అని విసుక్కుంటేన్నావా? విసుక్కున్నా నువ్వు అందంగానే ఉంటావు...నాకు తెలుసు అందమంటే గుర్తొచ్చింది. ఆవేళ కంచిపట్టుచీరలో... తలంటుజుత్తు... నుదుట కుంకుమబొట్టు.. ఒకచేతిలో పూజాద్రవ్యాలు పట్టుకుని కోవెలకి వెళ్తూంటే... నీ సౌందర్యం నాకు కన్నుల పండుగే చేసింది. ఆ క్షణం నుంచే నిన్ను ప్రేమించడం మొదలు పెట్టానేమో.. నువ్వు ప్రతిరూపం దాల్చిన పవిత్రతలాగే అనిపించావు గంభీరంగా సాగే నీ నడక ఎంత బాగుంటుంది!

ఒక్కొక్కసారి గాఢంగా అనిపిస్తుంది- నీ వెనుక నిశ్శబ్దంగా వచ్చి... నీ కనులను వేళ్లతో మూసి... నీ మెడను సున్నితంగా వెనక్కి నా వైపుకి వంచుకుని... పచ్చన నిండయిన నీ బుగ్గలమీద... కమ్మగా ముద్దుపెట్టుకుందామని అలాగే- కాంక్షగా కౌగలించుకుందామని. కాని- నీకు కోపం వస్తుందేమో అని భయం. త్వరలోనే నిన్ను ముద్దుపెట్టుకునే వరమివ్వవూ? నాలోని ఇంత మోహం... ప్రేమ... కాంక్ష... అభిమానం... ఆరాధన... అన్నిటినీ ఎన్నిమాటలలో చెప్పగలను- ఒక్క ముద్దూ, మరొక్క కౌగిలీ తప్ప?

ఏమిటాలోచిస్తున్నావ్? ప్రేమ- మనసుకి సంబంధించినదే కానీ, ఆ మనసుకాధారం తనువు కదా. అందుచేత- మనసు ప్రేమలో పడితే- శరీరానికి ప్రేమ కోరికలంటుతాయి, పూలతో కూడిన దారానికి కూడా కొంచెం సువాసనలబ్బేటట్లు.

"మైడియర్ మైథిలీ! ప్రేమకాలోచించనక్కర లేదు. వయసు, అంతస్తు... కులం... మతంలాటి అవరోధాలు పెళ్ళికే గాని ప్రేమకుండవు. పెళ్లి కిటికీ తెరచుకోగానే ప్రేమదీపం ఆరిపోతుందంటారు. మన ప్రేమదీపం మలగదు. ఎందుకంటే- మనం పెళ్ళి చేసుకోబోవడంలేదు. ప్రేమించు మైథిలీ... ప్రేమించు నన్ను"

ఉత్తరంలో మునిగిపోయిందామె. ఎన్నిసార్లు చదువుకుందో! బుగ్గమీద ముద్దు పెట్టుకుంటున్నట్లే... తీయగా కౌగలించు కుంటున్నట్లే... ఆ మాటలు. అబ్బ! ఎంత చక్కని ఉత్తరమని! ఆయన వస్తున్న అలికిడికి... ఉత్తరంలోంచి బయటపడి... కంగారుగా లోపలికి వెళ్ళింది. వారు ప్రేమలేఖని చూడకుండా.

టీ తాగుతూ-

"పరధ్యానంగా ఉంటున్నావేం?" అడిగారాయన.

"ఊఁ... ఉహు.."

"అమ్మాయి రాసిన ఉత్తరం కూడా తెరచి చదవలేదంటే... నీ మనసుని మరేదో.."

"అహ ఏమీలేదు. మరచిపోయాను." తడబడిందామె తప్పుచేస్తున్నట్లనిపిస్తూంటే.

"ఏమీలేదు" అని అక్కడినుంచి వెళ్లిపోయింది.

"ఏమో నువ్వు కొత్త మనిషిలా... నీలో ఏదో మార్పు..." వెనక నుంచి ఆయన మాటలు.

త్రుళ్ళిపడింది. వారు చెబుతున్నది నిజమే నేమో. తనలో... ఏమిటో మార్పు. దేనికోసమో తహతహ. ఏదోకావాలి. అదేమిటో తెలియడంలేదు.

బుధ... గురు... శుక్రవారాలు... ప్రతిరోజూ ప్రేమలేఖ. ఆమెకా ఉత్తరాలందుకోడం అనందమూ అలవాటూ అయిపోయాయి. ప్రేమలేఖ కోసం ఎదురు చూడడం ఆమె దినచర్యలో భాగమైపోయింది. ఇప్పుడామె మధ్యాహ్నమయితే చాలు. చక్కగా అలంకరించుకుని... పోస్టుమాన్ కోసం ఆరాటంగా ఎదురు చూస్తుంది. ఉత్తరం రాకపోతే గుండె ఆగిపోతుందేమో అన్నట్లుందామె పరిస్థితి.

శనివారం వచ్చిన ఉత్తరం- కొంచెం భిన్నంగా ఉంది.

"ప్రియమైన మైథిలీ! నా ఊర్వశీ. మళ్ళీ...మళ్ళీ...మళ్ళీ... ఐ లవ్ యు! ఎన్నిసార్లు చెప్పినా... ఎంతరాసినా... ఎన్ని ప్రేమలేఖలు సృష్టించినా ఈ హృదయంలోని ప్రేమ తాపం తీరేటట్లు లేదు. ప్రేమలేఖలు- రాసేనాకూ, అందుకునే నీకూ అద్భుతమయిన అనుభూతిని కలిగిస్తాయనేది తిరుగులేని నిజమే కాని- అంతకంటే బలమయిన సత్యం మరొకటుంది. వెయ్యిమాటలు వెలిబుచ్చలేని భావాన్ని ఒక్క స్పర్శ అందించగలదట. నిజమే అనిపిస్తూంది నాకూను. ఇన్ని ఉత్తరాలు వ్రాసినా- ఇంకా చెప్పవలసిందేదో మిగిలిపోయే ఉంది. ఆ భావాలకు- భాష చాలదేమో. అందుకే... నిజమయిన ప్రేమభాష- ముద్దు, కౌగిలీ, చూపు మాత్రమేనట. ఔనంటావు నువ్వూనూ, ఏం?

రేపు ఆదివారం. ప్రేమకి ఆదివారం శలవు దినం కాదనుకో. కాని- తపాలా శాఖకి శలవు

కదా. మరి రేపు నీకు నా ప్రేమలేఖ ఎలా అందుతుంది?

నువ్వొచ్చి ఇవ్వొచ్చుగా అనుకుంటున్నావు నిజమే, కాని... మన ప్రేమ ఉత్తరాల స్థాయినుంచి ఎదగాలని నా అభిలాష. చూడు అందాల రెమ్మా, జీవం లేని కాగితం మీద ప్రాణంలేని అక్షరాలే ప్రేమలో తడిసి అంత అందంగా తయారవగలిగాయే, ఆ మాటలకే ప్రాణం వొస్తే? నీలాగ అజంతా శిల్పానికి ప్రాణం వొచ్చినట్లు... అద్భుతంగా ఉండవూ? ఒక్కసారి చూద్దామా ఆ అనుభవాన్ని? కాదకను ప్రేయసీ.

రేపు... మనం ప్రేమ మాటలాడుకుందాం. అక్షరాలని అవతల పెట్టి ఎంతయినా ప్రేమలేఖలు వొట్టి ఏకపాత్రాభినయాలే. ప్రేమమాటలయితేనే ఇద్దరి నడుమా మరింత రసవత్తరంగా రాగరంజితాలై విలసిల్లగలవు. అబ్బో! నాకు కవిత్వం వొచ్చేస్తూంది! ఔను ప్రేమ కవిత్వం నేర్పుతుందట.

ఉత్తరాల కోసం నిరీక్షించడంలో కంటే ఉత్తరాలు రాసిన మనిషికోసం నిరీక్షించడం మరీ బాగుంటుంది తెలుసా? ఆ మనిషితో మాటలాడుకోడం మరీమధురం.

నీ చేతులను నా చేతులలోకి తీసుకొని... నీ కళ్ళల్లోకి చూస్తూ... నీ కెన్ని చెప్పాలని! అందుకే... పార్కుకిరా ఐదు గంటలకి. మనలాటి ప్రేమికులు తప్ప ఎవరూ రారులే అక్కడికి.

భయపడుతున్నావా రావడానికి నా మైథిలీ! ఎందుకూ? ఒంటరిగా కోవెలకి దేముడి దగ్గరకు వెళ్తూంటావుగా? పార్కుకి ప్రేమించిన వాడిదగ్గరకు చేరుకుందుకు వెరపు దేనికీ? నా జీవితం ఫణంగా పెడతాను. సరేనా?

రేపు నువ్వు రాకపోతే- ఏమవుతుందో చెప్పను, చెప్పలేను. వొస్తే ఏమౌతుందో మాత్రం తప్పకుండా చెప్పగలను. నువ్వు రావాలే కాని.. ఆశ్చర్యపోవూ! స్వర్గం చూడవూ! నీ జీవితమూ, నా జీవితమూ అనూహ్యంగా మారిపోవూ?

ప్లీజ్! మైడియర్... తప్పకుండారా. వొచ్చిచూడు... ఉత్తరం పూర్తిచేయడమేమిటి, ఆలోచనలో పడింది మైథిలి.

రేపు వెళ్ళడమా? ఎవరేనా చూస్తే ఏమనుకుంటారో. ఉహుఁ ఈ వయసులో తనని ఎవరనుమానిస్తారు? అతను- ఉత్తరాలే ఇంత బాగా రాస్తాడే! మాటలింకెంత తీయగా చెబుతాడో! ఒక్కసారి వెళ్ళి... ఏమౌతుందో చూస్తే...? తను వెళ్ళకపోతే.. కోపం తెచ్చుకుని... ఇంక ఉత్తరాలు రాయడం మానేస్తాడేమో. అమ్మో! ఆ ఉత్తరాలు బాగా అలవాటయిపోయాయే. అవి అందుకోకుండా బ్రతకగలదాతను?

తనని ఎలాటి ఇరుకులో పడేశాడు! తను అతనికి తెలుసు. తనకే అతనెవరో తెలియదు రేపు వెడితే అతన్ని చూడవొచ్చు. కాని...

ఆయన- "ఎక్కడికి?" అని అడిగితే? ఆదివారం కదా ఇంట్లోనే ఉంటారేమో.

ఎలా? ఆ మహానుభావుడు టైము కూడా నిర్ణయించేశాడాయె సాయంత్రం ఐదు గంటలని! రేపు- ఆ సమయానికి వారు ఎక్కడికేనా వెళ్ళిపోతే-

ఆమె ప్రార్థన భగవంతుడు విన్నట్లే ఉన్నాడు. ఆదివారం సాయంత్రం నాలుగౌతూంటే ఆయన... కొత్తగా తయారయ్యారు సిల్కు లాల్చీ... పంచె... కళ్ళజోడు... పెళ్ళికొడుకులాగే ఉన్నారు. ఔను.. ఆయన అందగాడే- వయసు ముదిరినా.

అయన అటు వెళ్లడమేమిటి – త్వరత్వరగా స్నానం చేసేసింది. బట్టల బీరువా దగ్గరకి నడచింది. పట్టుచీర?... ఉహుం .. ముసలిదానిలా ఆ చీర ఏమిటి? పట్టుచీరలు పేరంటాలకీ పెళ్లిళ్లకే గాని ప్రేమకి పనికిరావు. ఆ మధ్య ఎవరో పెట్టిన... వరేలీ... అది తీసింది.

ముఖానికి పౌడరు– నుదుట కుంకుమబొట్టు– తలలో పూలు– కొత్తచీర– అద్దం ముందు నిలుచుంటే– తన అందానికి తక్కువేమిటనిపించింది.

'నువ్వు వస్తే– నా జీవితమూ, నీ జీవితమూ అనూహ్యంగా మారిపోవూ?' ఉత్తరంలోని అతని రాత.

తన జీవితంలో మార్పా! ఏమిటిది? ఎలావొస్తుంది? తనని– దగ్గరగా చూసి– అతను 'సారీ! నువ్వింత ముసిలిదానిమకోలేదు. నిన్ను ప్రేమించినందుకు పశ్చాత్తాప పడుతున్నాను – వెళ్లిపో అనెయ్యడు కదా? అలాగే జరిగితే... తను ఎంతమాత్రమూ భరించలేదు. ' కనీసం నీ ప్రేమలేఖయినా దక్కనీ అవి లేకుండా నేను బతకలేను–' అని ప్రార్థించవలసిందే. ఆ ప్రేమలేఖలు తన జీవితమయి పోయాయి.

అలంకరణకి తుదిమెరుగులు దిద్దుకుని... యటకు వొచ్చి– రిక్షా ఎక్కింది. రిక్షా పరిగెడుతూంటే– ఒంట్లో సన్నగా వొణుకు.

తనేం చెయ్యబోతోంది?

ఇంత వయసు వొచ్చి... ఎవరో ముక్కూ మొహమూ తెలియనివాడి ప్రేమలేఖల వలలోపడి అతనికోసం సిగ్గులేకుండా బరితెగించి పార్కుకి పరిగెడుతోందా చిన్నపిల్లలా! భర్త, అమ్మాయి.. అబ్బాయి.. యిల్లు.. ఎలా మరిచిపోయిందిన్నీ? వెనక్కి వెళ్ళిపోతే?

అప్పటికే రిక్షా ఆగింది. పార్కు గేటు ముందు. దిగి లోపలికి వెళ్ళడమా మానడమా అని సందేహిస్తున్నట్లు గేటు దగ్గరే నిలబడిపోయింది.

ఆమె మెదడులో మళ్ళీ ఓ ప్రేమలేఖలోని వాక్యాలు.

మైథిలీ...నా హృదయమా! నిజానికి యిప్పుడే ప్రేమించదగిన వయసు. అబ్బాయిని చదువుకీ, అమ్మాయిని అత్తారింటికీ పంపేశావు. బాధ్యతలూ, బాధలూ లేవు. బోలెడంత తీరిక. చీకూచింతా లేవు. జీవితాన్ని అనుకున్నట్లు అనుభవించగలిగిన అవకాశం. చూడూ! జీవితమూ సౌందర్యమూ, గులాబి మొగ్గలే కావు గుమ్మడి పువ్వులూను. జీవితం– నీటి ఊటలాంటిది. మురగబెట్టుకోకు చేతులారా. అందుకుందామనే అభిలాష ఉండాలే కాని జీవితానందం నిత్యవసంతమే. ప్రయత్నించు. ప్రేయసీ, ప్రయత్నించు. ప్రేమించు ప్రేయసీ ప్రేమించు. ప్రేమ ఎంత మధురం!

నిజమే... ఎన్నో రాత్రులు... ఒంటరిగా నిద్ర పట్టక.. వారు పిలిస్తే బాగుండును. వారు పిలవాలే కాని పిలిచిందే తడవుగా వెళ్లి వారి కౌగిలిలో కరిగిపోదూ తను? అనుకొనేది, వారు పిలిచేవారు కాదు. తనకి దుఃఖం వచ్చేది. రాత్రులు– ఒంటరితనమూ వేదనా. పోనీ, తనయినా చొరవ తీసుకోవచ్చుగా? ఉహుం – స్తబ్దత. సిగ్గు, సంకోచం, భయం... వారేమనుకుంటారో అని. మళ్ళీ– జీవితం నిస్సారంగా నిష్ఫలంగా గడిచిపోతూందే అని బాధ. తన మనసు.. తన బాధ.. వారికి నివేదించుకుందుకు... సంకోచం. భార్యాభర్తలే అయినా తమమధ్య మానసికంగా ఎంత దూరం!

ఈ ప్రేమలేఖలబ్బాయి- తనలో మార్పు తెచ్చాడు కేవలం ఉత్తరాలతోనే తనని జీవితం పట్ల ఊరించేస్తున్నాడు. అతన్ని చూడలేకపోతే ఎలా, యింత వరకూ వచ్చి? అప్రయత్నంగానే ఆమె పార్కులోకి నడిచింది.

ఆతృత. ఎవరో అతను? మరీ కుర్రవాడు కాకపోతే బాగుండును. కనీసం పాతికదాటి...ముప్పయ్ ...అలాగ లేకపోతే ప్రేమ మాటలూ, ప్రేమ చేష్టలూ మరిచి... తనని చూస్తూనే ఆంటీ అనేస్తాడేమో.

"మైథిలీ!"

ఉలిక్కిపడిందామె. హడలిపోతూ అటు చూసింది.

వారే!

"మీరు... మీరా!"

"నేను నేనేకాని... నువ్వేమిటి యిలా వచ్చావు? నాతో చెబితే నేనే తీసుకొచ్చేవాడినిగా.." భయకంపితురాలౌతోందామె. ఆయనతో చెప్పడం- ఏ ముఖం పెట్టుకుని? గతంలో ఒకటి రెండుసార్లు వారు... "సినిమాకో షికారుకో వెళ్దామా మైథిలీ సరదాగా?" అని అడిగితే- ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ముసిలికాలంలో ముచ్చట్లని ముఖం మీదే నవ్వరూ?" అని వారి సరదా మీద నీళ్ళు జల్లేసింది. ఇప్పుడు... తను... పార్కుకి- ఒంటరిగా ఎందుకు రావలసి వొచ్చిందో వారికి చెప్పగలదా!

"మీరు- యిక్కడికి... ఎందుకు.." నోరు పెగలడం లేదామెకి.

ఆయన నవ్వాడు. 'అదో విచిత్రమయిన కథలే. ఒకరికోసం నిరీక్షిస్తున్నాను. నువ్వొచ్చావు. పద... అలా వెళ్ళి ఆ మూల కూర్చుని మాట్లాడుకుందాం"

తన చేతిని ఆయన చేతిలోకి తీసుకుని నడిపిస్తూంటే.. ఆమె ఏమీ చేయలేకపోయింది. వారి పక్క నడవడం తప్ప. అసహాయంగా.. అశక్తురాలయి బొమ్మలా నడుస్తూ- ఆమె మనసులో దేముణ్ణి ప్రార్థించింది.

'భగవంతుడా! ఈ సమయంలో మాత్రం ఆ ప్రేమలేఖలబ్బాయిని యిక్కడికి పంపి నా జీవితం రసాభస చెయ్యకు. రక్షించు.. నీకు పుణ్యముంటుంది'

అప్పటికామె తనకి తెలియకుండానే.. ఆయనకెదురుగా.. లాన్‌లో.. బవర్స్ వెనుక.. తలవొంచుకుని కూర్చుంది- చాలా అసహనంగానూ అసౌకర్యంగానూ.

"ఏమిటాలోచిస్తున్నావ్? నేనిక్కడికెందుకు వచ్చాననా? నిజానికి- ఆశ్చర్యపడవలసింది నేనిక్కడికెందుకు వచ్చానని కాదు. నువ్వెందుకు వచ్చావా అనే కాదూ?"

"ఇంట్లో... వంటరిగా... ఏమీ తోచక.." గొణిగిందామె.

"నిజమే.. వంటరితనం అతి బాధాకరమయినది సుమా! అది శారీరకమయినా, మానసికమయినా, మనిషి- వంటరితనం నుంచి బయటపడేందుకు ఏమయినా ప్రయత్నం చేస్తే అది నేరం ఔతుందనుకోను" ఏమంటావన్నట్లు చూశారు.

ఆమె ఏమీ అనలేదు, ఔనన్నట్లు తల ఊపడం తప్ప.

"మనం- ఇలా... యిక్కడ కలుసుకోడం.. ఇదీ వొకందుకు మంచిదేనేమో. వినడానికి నీకభ్యంతరం

లేదంటే.. నేనిక్కడికెందుకు వొచ్చానో చెబుతాను. నీ మనసిక్కడ ఉంది- వినగలనంటేనే సుమా!"

గతుక్కుమందామె. తన మనసిక్కడలేదని ఆయనకెలా తెలుసు? బొంకులాగే ఉత్తరాలు కూడా దాగవేమో. కనీసం- ప్రేమలేఖలు.

"ఇంట్లో అయితే నేను చెప్పలేకపోయేవాడినేమో. ఈ పార్కులో... మనిద్దరమూ... స్నేహితులలా- అనిపిస్తూ..."

"అయ్యో! చెప్పండి. నేను శ్రద్ధగానే వింటున్నాను"

భార్యాభర్తలు... భౌతికంగా దగ్గరగా కనిపిస్తారు కానీ.. నిజానికి.. వాళ్ల మధ్య మానసికంగా ఎంత దూరమయినా ఉండవొచ్చు.

ఆమె ఏమనగలదు? తన మనసుని చదివేస్తున్నట్లు వారు చెబుతూంటే.

"అర్ధాంగి అనీ జీవనసహచరుడనీ ఏమేమో అంటారు కానీ.. భార్య భర్తకి చెప్పుకోనివీ భర్త భార్యకి చెప్పుకోనివీ చాలా విషయాలే ఉండవొచ్చు" ఒకక్షణం ఆగాడు. హఠాత్తుగా అన్నారాయన- "సెవెన్ యియర్ యిచ్- అనే పదం విన్నావా?"

"ఉహూం"

పాశ్చాత్య దేశాలలో.. ఆ వాతావరణమూ పరిసరాలనూ బట్టి... ఏడేళ్ళు కలిసి కాపురం చేసిన దంపతులలో కలిగే విసుగుకే పర్యాయపదం యీ సెవెన్ యియర్ యిచ్. అలవాటు పడిపోవడం వలన... మార్పులేని జీవితం వల్ల... కలుగుతుందీ యిచ్. విసుగుకి విదేశమేమిటి, స్వదేశమేమిటి? ఇరవై మూడేళ్లు.. ఒకే ఉద్యోగం చేసిచేసీ.. ఇరవై రెండేళ్ళు సంసారం చేసి... నాలోనూ ఆ విసుగు ప్రారంభమయింది కొన్నాళ్ళ క్రితం"

ఆమెకు భయమేసింది. వీరు- ఏం చెప్పబోతున్నారు? తీయని ప్రేమమాటలు వినాలని వొచ్చిన తనకి ఈయన ఏ చేదు నిజమో చెప్పబోవడంలేదు కదా? ఆయనకే కాదు, తనకీ జీవితమంటే విసుగే వేస్తూంది. జీవితమింతేనా? జీవితం అయిపోయిందా?

ఇంకేమీ మిగలనట్లుందే- ఈ శూన్యమూ స్థబ్దత తప్ప. అటువంటి పరిస్థితిలో అందడం వల్లనే కాబోలు ఆ ప్రేమలేఖలు తననంత వెర్రిదాన్ని చేసి వొదిలాయి. తనని ఆ ప్రేమలేఖలలాగ.. వీరిని ఏదయినా వ్యవహారం... అసలే మగవాళ్లు. ఆపైన రోజులు బాగులేవు. ఆకర్షణకి వయసుతో నిమిత్తమేముండాలి?

"ఆ విసుగునుంచి తప్పించుకోవాలి. అందుకేదయినా చెయ్యాలి! ఏం చెయ్యాలి? జీవితంలోకి కొంచెం ఉత్సాహమూ, ఉల్లాసమూ రావాలంటే... బతుకులో కాస్త ఉత్కంఠ ఉండాలంటే... ఏదోవొకటి చెయ్యాలి తప్పదు. విదేశాలలో అయితే.. వారి సంస్కృతీ సంప్రదాయాలూ అవరోధం కావు కనుక దంపతులు- వివాహేతర సంబంధాలు ఏర్పరచుకుని- తమ జీవితాల్లోకి ఆ మార్పు ద్వారా కొంత థ్రిల్‌ని తెచ్చుకుంటారు."

ఆమె హృదయం గజగజ వణికింది... ఆ మాటలకి. ప్రేమలేఖలు రాసే అతన్ని తన లాగ ఆయన ఎవరినేనా.. ప్రేమిస్తున్నారా? తననేరానికి ఆ శిక్ష కాదు కదా?

"నాకు స్ఫురించిన మార్గం- ప్రేమించడం. నిజంగా ప్రేమించడంలో ఉండే థ్రిల్లూ, సస్పెన్సూ

మరెందులో లభిస్తాయని? మనది- మామూలు వివాహమే. ప్రేమించుకుని పెళ్లి చేసుకోలేదు కనుక.. మన జీవితాలకి- ప్రేమ తాజా అనుభూతే. నేను- ప్రేమించాలని నిశ్చయించుకున్నాను. విసుగు నిండిన జీవితాన్ని ప్రేమ మార్గమే సంతోషమయం చేయగలదనిపించింది. అంతే... ప్రేమలేఖలు వ్రాయడం మొదలుపెట్టాను." ఆమె కన్నీళ్ల పర్యంతం అవుతోంది. తనభర్త- ఎవరినో ప్రేమిస్తున్నారు! అబ్బా...

"నలభైలో యౌవనం పునరావిర్భవిస్తుందట. నా వయసు నలభయ్యారు. ప్రేమకి వయసుండదు కాని... నలభయ్యారు వృద్ధాప్య మేమీ కాదనుకుంటాను. మగవాళ్లకి అరె! నీ కళ్లల్లో ఆ నీళ్లేమిటీ?"

"ఏమీలేదు. ఏదో నలకపడింది... గాలికి.." అని బయటకని.. ముప్ఫయ్యారు స్త్రీకి వృద్ధాప్యం కాదు.. ఆమెకీ అది ప్రేమవయసే... అనుకుంది మనసులో.

"కొన్ని మాటలు- మనిషి ఎదురుగా చెప్పడానికి బాగానూ ఉండవు. చెప్పే వీలూ ఉండదు. అటువంటప్పుడు- ఉత్తరాలు చాలా సహాయం చేస్తాయి. అందుకే- సముఖంలో కూడా రాయబారాలూ, ప్రేమలేఖలూ అవసరమవడం. మైథిలీ! నా విషయమే తీసుకో, నీకెన్నో చెప్పాలనుకునేవాడిని. కాని... నీ ఎదురుగా... నోరు పెగిలేది కాదు. మనసేమూగబోయేది."

చాలా నిజం. తనకీ అంతే. తన వొంటరితనం గురించీ... విసుగు గురించీ ఒక్కసారయినా అయనకి చెప్పగలిగిందా మనిషి ఎదురుగానే ఉన్నా? కొన్ని మాటలంతే. రాయవలసిందే తప్ప మాట్లాడుకుందుకు బాగుండవు. సౌకర్యంగా ఉండవు. సరిగ్గా తనలాటి అవస్థ అనుభవించారన్నమాట వారూనూ! ఎంత చిత్రం!

"నా ప్రేమని ముఖాముఖి చెప్పలేక... లేఖలలో చెప్పుకునేందుకే రచయిత సాయం తీసుకున్నాను. ప్రేమలేఖలు రాయడం నేర్చుకున్నాను మైథిలీ! ప్రేమించడంలాగే ప్రేమలేఖలు రాయడం కూడా చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది సుమా!"

ఒక్కసారి.. ఆమెకి అంతా అర్థమైపోయినట్లనిపించింది. చిరునవ్వు నవ్వుతూ- ప్రేమలేఖలందుకున్ని... చదువు కోడంలో కూడా తక్కువ థ్రిల్ ఉండదు. ఆ ఆనందం మీకనుభవానికి వొచ్చి ఉండదు ఏం...?

'ఔను" అన్నాడాయన.

"అందుకే..." అంటూ ఆమె వానిటీ బాగ్‌లోంచి కాగితాలు తీసింది.

"ఏమిటివి?"

"పోస్టు చెయ్యవలసిన ప్రేమలేఖలు ఎవరు రాశారో ఇప్పుడు నాకు తెలిసిపోయింది. నాకు ఒక్కొక్క ఉత్తరమూ అందుతూంటే- దానికి జవాబు ఏనాటికానాడు వ్రాస్తూ వొచ్చాను. కాని... నాకు లేఖలు రాసిందెవరో తెలియదుగా అందుకని... స్వయంగా ఇద్దామని ఇక్కడికి తెచ్చాను"

"థాంక్యూ... ఐతే నేను ప్రేమలేఖలందుకునే భాగ్యానికి కూడా నోచుకుంటున్నానన్న మాట." చేయిజాపాడు.

"ఇప్పుడు కాదు. రేపు సోమవారం... నుంచీ నేను మీకు రోజుకొకటి చొప్పున పోస్టుచేస్తాను. అలా అయితే సస్పెన్సు ఉంటుంది. ఏం?"

"ఔను-" అంటూ ఆయన ఆమెని దగ్గరకి తీసుకోబోయాడు.

"ఇది- పార్కు" "నువ్వు మరీ అందంగా ఉన్నావు మరి. ఇక్కడ చీకటిగానే ఉందిగా- ఫరవాలేదు"

"ఉహుం చీకటేమిటి, అవతల వెన్నెల వొచ్చేస్తూంటే"

"జానుకో. కాని.. మనం... పార్కులో కొంచెమయినా ప్రేమించుకోవాలిగా..." అంటూ అమె నొక్కసారి కౌగలించుకుని... చిన్న ముద్దు పెట్టి... వొదిలాడు.

ఇద్దరు నడుస్తూ- ఆనందంగానూ ఆశ్చర్యంగానూ-

మనసులో అనుకున్నారు - "కొత్త జీవితం ప్రారంభమౌతూంది".

✡ ✡ ✡ ✡ ✡

# లాటరీ

దేముడు మహామంచివాడు. అమిత చెడ్డవాడు! ఈతకాయ చూపి తాటికాయ లాక్కుంటాడు. అదో ఆట. అంతే.

'ఎదవ బతుకు' - కసిగా పెదవి కొరుక్కున్నాడు రాములు- మందుల షాపు మెట్లుదిగుతూ. పేదవాడికోపం పెదవికి చేటని రుజువౌతూ అతని పెదవి చిట్లి మంట పెట్టసాగింది.

గుండెలలోనూ మండుతూంది. కన్నీళ్ళాపుకుందుకయితే రెప్పలున్నాయి. గుండెమంట లారేదెలా? ఒక్కసారి పిడికిలి విప్పి చూసుకున్నాడు. నలిగి- మాసిన నోట్లు కనిపించాయి. మూడ్రెళ్ళూ, ఓ ఐదు... వెరసి పదకొండు. చాలదు. మరో పది కావాలి. సీసా ఖరీదు ఇరవై ఒకటి. సీతాలు చావుబతుకు సందిలో పడుంది. నులిక మంచం మీద మాంసం ముద్దలా పడుంది. మందుపడితే కాని మంచం దిగదు. దిగలేదు. వేగంగా పడాలి సూదిమందు. సూదిమందంటే- ఇరవయ్యొక్క రూపాయలు. డాక్టరు బాబు యిట్టే రాసి మొహం మీద విసిరేశాడు చీటి. చీటీ రాసెయ్యడానికేం, చిటికంత సేపు, సూదిమందు కొనాలంటే చచ్చే చావౌతుంది. డబ్బున్న మారాజుకి బతుకు బాధేం తెలుస్తుంది? రిచ్చా తొక్కడమంటే బుర్రున కారు తోలడం కాదు. ఐనా పేదోళ్లకి జబ్బులేమిటి? డబ్బున్న వాళ్లకి కాని. చక్కనమ్మ చిక్కినా సన్నబట్ట మాసినా అందమే అన్నట్లు డబ్బు కలవారికి జబ్బులొచ్చినా సుఖమే. పేదోళ్ళకి- గంజి నీళ్ళందడమే గగనంగా ఉన్న గడ్డు రోజుల్లో పెద్ద జబ్బులొస్తే ఖరీదయిన మందులెలా కొనగలరు? అదేమిటో యిసిత్రం. నదులన్నీ సముద్రంలోనే చేరేటట్లు కలవారినే వరిస్తుంది సిరి. నిన్నా యివాళా ఎండనక వాననక పగలనక రాత్రనక కండలు కరిగేలా రిచ్చా తొక్కితే అద్దె డబ్బులు పోను మిగిలిందెంత? ఇరవయ్యొకటి కాదు, పదకొండు మాత్రమే.

కాళ్ళు నొప్పెట్టేలా, ఎముక విరిగేలా వొళ్ళు హూనమయ్యేలా రిచ్చాబండి లాగి రూకలు సంపాదించంది - కూడబెడదామనీ కాదు, కూచుని కులాసా సేద్దామనీ కాదు. సీతాలుని రచ్చించు కుందామని.